# ఒక ఒర - రెండు కత్తులు

నేరకపోయి ఎత్తానా? 'ప్చ్!' నాలిక్కరుచుకున్నాను. నెత్తిబాదుకున్నాను. లాభం లేదు... 'చిన్నదాయి పెద్దదాయి ఎలా వున్నారు?' అని నాలుక మీది నుండి నా మట జారిపోయినప్పుడే నా చెయ్యి జారిపోయింది. ఇప్పుడు అమ్మనాన్నల చేతుల్లోకి వెళ్ళిపోయింది. వాళ్ల చేతులూ దాటిపోయిందా? కాకపోతే నాలుగేళ్ళుగా నానుతున్న తగువు ఒక ఒడ్డుకి చేరలేదు. అమ్మా నాన్నా కూడా ఎప్పట్లాగే ఎవరి ఒడ్డును వాళ్ళు వదిలినట్టు లేరు.

ఒక రాజుకు ఏడుగురు కొడుకులు... కథలాగే 'అతగానికి ఇద్దరు పెళ్ళాలు వీధిల పడ్డారు?' అంటూ కథ మొదలయింది. 'పెద్దదానా పెద్దదానా నువ్వెందుకు వీధిల పడ్డావ్?' 'చిన్నదాయి వచ్చాక నా అవసరం లేదు, అందుకే నన్ను వీధిల పడేసినాడు' 'చిన్నదానా చిన్నదానా నువ్వెందుకొచ్చావ్?', 'పెద్దదాయి మాయక్కే నన్ను తీసుకొచ్చింది.' 'పెద్దదానా పెద్దదానా చిన్న దాన్నెందుకు తెచ్చినావు?', 'నేను పురిటికని పోయి, మా ఆయన వంటకి తెచ్చి పెట్టినాను,', 'పురడయి పోయింది పున్నెమూ అయిపోయింది ఇంకా ఏమున్నావే చిన్నదానా? 'అతగాడు నా కడుపులో చెయ్యి పెట్టేసాడు' అంది చిన్నదాయి. 'చిన్నదాని బంగారం కడుపులో చెయ్యెందుకు పెట్టావురా అతగాడా?'

అతగాడు జవాబివ్వలేదు కాకపోతే ఏం జవాబు చెప్తాడో అతని పక్క వకల్తా పుచ్చుకున్న వకీలుగా వున్న మానాన్న ఇంటికోర్టు హాల్లో ఇక వినిపిస్తారు. మా అమ్మ ప్రతివాదన చేస్తుంది. ఎప్పట్లాగా మా అమ్మ నాన్నలిద్దరూ వాళ్ళ వాదనలు విన్నందుకు వింటున్నందుకు మళ్ళీ నన్ను జడ్జీని చేసారు. మా ఆవిడ బెంచిక్లర్క్‌లా తన పనులేవో తను చేసుకుంటూ తనకీ తగువుకీ సంబంధం లేనట్లే వుంది. మా తమ్ముళ్ళూ నా పిల్లలూ ప్రేక్షకులయినారు.

నాకు ఉద్యోగమయి ఆ తర్వాత పెళ్లయి ఆ వెనుక విజయనగరం అక్కడి నుండి హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫరయ్యాక ఊరు నాకొక ఊహే అయింది. ఆ ఊహకు అమ్మ వూపిరి పోస్తుంది నేను గాలి పీల్చుకుంటాను.

అచ్చమ్మ చనిపోయింది. సింతప్ప బతికే వుంది. బాబూరావు కాపురమెలిపోయాడు. అప్పల్రాముడి కొడుకు ఆలయ్యతో దెబ్బలాటొచ్చి ఇల్లొదిలీసి ఎలిపోయాడు. శీనుగాడి పెళ్ళాం పాపం ఉరిపోసుకుంది. ఎలక్షన్ గొడవల్లో జానకత్త మొగుడ్ని చంపేసారు. వీధిలో కుర్రాళ్ళ రౌడీయిజం నేర్చారు. ఎవర్నో చంపేసారు. వీధి ఇన్నాల్లాటి వీధేటి? ఇన్నాళ్ళాగ వుందేటి? అన్నట్టు నీ ఫ్రెండు నీతో చదువుకున్నోడు క్రిష్ణ ఉద్యోగం రాలేదని ఎండ్రిన్ తాగేసి చచ్చిపోయాడు.

అమ్మ చెప్పుకు పోతుంది. వెంటపడలేనంత వేగంగా వొంపులు తిరుగుతూ కాలం కనురెప్ప సందులో సహితం జారిపోతుంది. నేనెక్కడో ఆలోచనల ఆనకట్టల దగ్గర ఆగిపోతానా? అమ్మ గట్టు కొట్టేసినట్టు గుక్క తిప్పుకోకుండా చెపుతుంది. ఎవరెవరి పెళ్ళిళ్ళు... పిల్లలు... చావులు...!

ఇలా చాలా దూరం తిరిగాక ఆలసిపోయాక కూర్చున్నాక మళ్ళీ మొదలు... శీర్షికలు దాటి వాటి వార్తల వివరాల్లోకి వీధి వదిలి క్వార్టర్స్‌లోకి వచ్చాం కదా నేనూ అక్కడికి వచ్చి ఆగుతాను. వివరాల్లోకి వెళితే విప్పుకోలేనంత జీవితం.

నాలుగేళ్ళ బర్నింగ్ఇష్యూ కదా అని బర్నల్ తిప్పానో లేదో స్టవ్వుకి రెండువైపులా అగ్గి అంటుకున్నట్టు అమ్మా నాన్నా అంటుకున్నారు. భగ్గుమంటున్నారు. చిన్నదాయి పెద్దదాయి అంటూ అగ్గి ముట్టించాక అనుభవించాల్సిందే... కాలాల్సిందే... ఆపడం, ఆర్పడం నా చేతుల్లో లేదు.

'ఏటి సెప్పేదిరా ధనమూ?! నేతికుండ నేలజారి పోయిన్తర్వాత నెత్తితీసి నేలకు పాముకుంటే మాత్రం వస్తాదిరా? పిచ్చి బ్రమ పడిపోతున్నావు' మా అమ్మ మొదలెట్టిందో లేదో నాన్న అందుకొన్నారు.

'పిచ్చి బ్రమ ఎవులెందుకు పడిపోతారు? నువ్వు గదా అడ్డుగ పడిపోతన్నావు ఆడోల సోబత్తని'

'ఆ మా పిన్నికూతురూ... అప్పజెళ్ళిలూ, అడ్డగ పడిపోతన్నాను... అవేం మాటలు నోరున్నందుకయినా నేయం మాట్లాడుకోవాల' అమ్మ అంది. మామూలుగా కాదు. కాదన్నా తన రక్తసంబంధం గురించి మాట్లాడినట్టే వుంది. ఆ గొంతూ, చూపూ మామూలుగా లేవు. నాన్న ముఖం కూడా ప్రశాంతంగా లేదు.

'దోషమని దొడ్లెడితే వాసాలు లెక్కెట్టినాడురా వాసాలూ' అమ్మే మళ్లీ అంది.

'వయిపిన దాన్ని తెచ్చి ఇంట్లెడితే ఏటవుతాది?' నాన్న అమ్మనే ప్రశ్నించారు.

'ఇల్లు సీకటని దీపం పెడతాం అలాగనీసి ఆ అగ్గితోటి ముంజూరుకు ముట్టించీమని కాదు' అమ్మ కోపంగా అనడం గొంతులోనే కాదు చూపులోనూ తెలుస్తోంది.

అమ్మని చూసి నాన్న చిన్న నవ్వు నవ్వేరు. ఆ నవ్వుకి అమ్మ మరింత ధుమ ధుమలాడింది. నాన్న వంక అసహ్యంగా చూసి, నా వేపు చూపు తిప్పుకొని చెప్పనారంభించింది.

'నాలుగేళ్ళయి నలుగుర్ల పడిపోయినా, ఈకత మొదలయ్యింది. నువ్వు పుట్టిన నాలుగేళ్ళకి. ఇప్పడిది కాదు, పాతికేళ్ళ క్రితం మాట. అతగాడు. ఆ పెద్ద మనిషి ఈ పెద్దదాన్ని పెళ్ళాడాడు, పెద్దలు కుదిర్చిందే... పెళ్ళియితేటి పిల్లలే గదా... నీకు తెలుసునుగదా. పెద్దదానికి ఇద్దరు పిల్లలు. ఒక కొడుకు. మరొక కూతురు. మీ యావిడలాగే ఆయమ్మకీ కాన్పు కష్టం. సిజరిన్ను పేగే కాదు, కడుపు కొయ్యించుకోవడమెంత బాద? ఆ పని ఇంట్ల జరిగే పనికాదు, ఆస్పత్రిలోట ఏసేస్రను... అల్లుకుళ్ళాలయి పోనారు. అదిగో అప్పుడు ఆ బావు బాదలు పడిపోతాడని పురటాల కింద సెయ్యడానికి కాదు, మగోడు ఏటి వండుకొనీ వార్చుకొనీ కష్టబడిపోతాడని అల సెల్లెల్ని తెచ్చినారు. ఆ యింట్ల ఎట్టినారు. పెళ్ళాం ఆస్పత్రిలో వుంటే ఈ మగోడు అల చెల్లిలి కడుపులో చెయ్యి పెట్టేసినాడు' టూకీగా చెప్పినట్టే చెప్పినా సుదీర్ఘంగానే చెప్పింది.

మా ఆవిడ పిల్లల్ని బయటకు పోయి ఆడుకోమంది, మా తమ్ముళ్ళని తెలుసుకోవలసిన విషయాలన్నట్టు ఏమీ అనలేదు.

మళ్ళీ మా అమ్మే ఏదో చెప్పబోయింది. నాన్న అవకాశం ఇవ్వకుండా 'వయిసిన దాన్నెందుకు తెచ్చారు?' మళ్ళీ మళ్ళీ అదే మాట. ముసిముసి నవ్వు.

'సిగ్గులేని నవ్వు. సిగ్గులేని నవ్వని. వయిసినదాన్ని తేకపోతే కాలురాని పసిపిల్లల్నీ, కళ్ళుపడని ముసిలోళ్ళనీ తెస్తార్రా? అయినా ఆపద తీరడం సూత్తారుగాని అలాటప్పుడు వయసూ సూడరు, జాతకాలూ సూడరు. ఇదిగిలాటోళ్ళు ఆ వచ్చిన దాని వయసే గాని వరసలు సూడర్రా?' మా అమ్మనన్నే అడుగుతోంది.

'వరుసకి మరదలే గదా మరదలు వరసే గదా?' మా నాన్న మురిపెంగా గొణుగుతున్నారు.

'అవునయ్యా నీకు ఎందరు మరదళ్ళుంటే అందరూ వరసే గదాని కట్టేసుకుంటావా?' అమ్మ ఈ దఫా నన్నొదిలేసి నాన్ననే అడిగింది. నాన్న కూడా అతగాడి వకల్తదారే కాదు, అతగాడే అయినట్టు తలదించుకున్నారు. దించుకొని ఓరగా చూస్తూ 'మనచేతిల ఏం లేదు, అంతా భగవంతుడి రాత' అన్నారు.

ఒక్క క్షణం వ్యవధివ్వకుండా అమ్మ అంది. 'అవును బగమంతుడు బద్దలైపోయిన బగమంతుడొకడు ఆడు సీటి రాసి పెట్నాడు. ఆ సీటి నువ్వే పట్టుకెళ్ళి అతగానికిచ్చినావు. అతగాడా సీటి ప్రకారమే ఏమేం సెయ్యాలని బగమంతుడు రాసాడో అవన్నీ సేసాడు. ఆ బగమంతుడు సెయ్యించినాడు, అతగాడు ఆడమన్నట్టల్లా ఆడాడు.

అమ్మ చేతులు తిప్పి మరీ అంది. ఆ చేష్టలకి నాన్నకే కాదు నాకూ నవ్వొచ్చింది. నేనెలాగో ఆపుకున్నాను. మా ఆవిడ ఆపుకోలేక కిసుక్కుమని పైటచెంగు నోటికడ్డం పెట్టుకుంది.

'సిగ్గులేని మొకానికి నవ్వే సింగారం' అని ఒక్కక్షణం ఆగి 'సిగ్గులేని బేపికి జిబ్బితోటి కొడితే ఇల్లా కత్తలకొచ్చి ఇప్పి సూసుకుందట, అలాటి ఇలాటి పాల్తు మనసుల్తోటి ఏటి?' అమ్మ అనేసి మా ఆవిడ తెచ్చిన టీని అందుకొని తాగింది. నాన్నా మిగతా వాళ్ళం టీ తాగుతున్నా, నాకయితే టీ వేడి తెలియలేదు.

నాకర్థం కావడానికన్నట్టు మా అమ్మ ఆ వృత్తాంతాన్ని అక్కడితో వదలలేదు. పెద్దదాయి ఆస్పెట్లి నుండి వచ్చేసరికి కుట్లువిప్పేసరికే అడుగులు వేసి సుబ్బరంగా నడిచే సరికే చిన్న దానికి మూడో నెల కడుపట. పెద్దదాని కూతురికి ఏడాది తిరిగేసరికి, చిన్నదాని కొడుక్కి మూడో నెలట. చిన్నదానికి సిజరిన్ కాదట. లేపోతే సాయానికి మరో మరదలిని వుంటే తెస్తే అతగాడు మనువాడీసి వుండేవాడు. అమ్మ ఎత్తిపొడిచింది.

నే వూరు వచ్చినప్పుడల్లా విన్న వృత్తాంతమయి నందుచేత అంతం తెలుసుకోవడానికి ఆదినుండి వినేవాణ్ని. మా ఆవిడ మిస్సయినందువల్లో మిస్టరీ అర్థంకాకో 'చిన్నావిడ పెళ్ళో అత్తమ్మా' అంటూ అడిగింది.

'ఆ ముడేసి నాడటమ్మా. రోటికాడ ముడి. సేసిన గాముండానికి ఆగండడు ఈదిలేటి ఏస్తాడుముడి? మా అమ్మ చెపుతుండగానే మా ఆవిడ 'పెద్దావిడ ఎలా ఒప్పుకుంది?' ఆగలేక అడిగింది.

కథ చెప్పనీ అన్నట్టు మా అమ్మ మొదలెట్టకుండానే మా నాన్న తలాడిస్తున్నారు. మా నాన్న చేష్టలు చూసి మా తమ్ముళ్ళు మా అమ్మకంట పడకుండా కళ్ళతోనే నవ్వుతున్నారు.

'ఏ ఆడదాయయినా దాని పెనిమిటి పెళ్ళికి బతికుండగా ఒప్పుకోదు. సస్తే ఎలాగా లేదు. ఈ ముండ మగోలు ఒప్పిస్తారు. మాయ సేస్తారు. మబ్బిపెడతారు. ఆతగాడూ తాటించి నాడట. పెళ్ళి సెయ్యకపోతే సచ్చిపోతానని. అప్పుడికీ పెద్దదాయి సస్తే సవ్వని అనీసి ఒప్పుకోలేదట. అద్దిరి బంచత్. అలగెలగవుద్ది? నువ్వు సూస్తే గట్టిదానవు కాదు. నా కింద సెయ్యాలా?! నాదసలే రైల్వేరుజ్జోగం. ఆపరేటింగు పని. తిండి సదుపాయం లేకపోతే పైసాకి పనిసెయ్యం. ఆల సెల్లెల్నివ్వకపోతే వుంకోల్ని అయినా తెచ్చేసుకుంటానని జైయ్యర బబ్బుని గెంతినాడట' అమ్మ చెప్పడం చూసి నాన్న 'మీయమ్మ అప్పుడు అక్కడే వుందిరా, సూసిందిలే' గొంతులో వెటకారం.

'చట్టం ఒప్పుకోదు కదమ్మా రెండో పెళ్ళికి?' మా తమ్ముడు అడిగాడు.

'సట్టాలు ఎన్నో ఏల? తాగినోడికవి సుట్టలు... సుట్టపీకలు. పీల్చేసి అవతల పడీడమే, అంతకన్నా అవేనికి? మీలాటోల సదువుకి తప్పు! ఎంత మంది ఇద్దరు పెళ్ళాలోలులేరు, ఆలందరూ సట్టాన్ని అడిగేసే సేసుకున్నారా?' మీ తమ్ముడిదో ప్రశ్న కాదన్నట్టు మా అమ్మ తీసిపారేసింది.

'మరి వాళ్ళ అమ్మానాన్నలు ఒప్పుకున్నారా?' తమ్ముడి ఇన్విస్టిగేటివ్ జర్నలిజం ప్రారంభమయింది.

కడుపు తీయించేద్దామంటే అమ్మాయి తల్లిదండ్రులు ఒప్పుకోలేదట. నలుగురికీ తెలిసాక తీసి ప్రయోజనం లేదన్నారట. మూడు నిండి నాలుగొచ్చింది. అవదన్నారట. అతగాడు అమ్మాయి చిన్నదాని మోజులో పడి చస్తానన్నాడట. పెద్దదాయి పెళ్ళాంతో 'నువ్వు ముండమోస్తావ్' అన్నాడట. చిన్నదానికి కానీ కట్నం అక్కర్లేదన్నాడట.

అమ్మ చెప్పుకుపోతోంది.

కట్నం ఎత్తి ఇవ్వక్కర్లేదు... అల్లుడు ఎలాంటి వాడో నన్న బాధ లేదు. భయం లేదు. రేపు ఎవడికో కట్టబెట్టినా వాడయినా ఇంకో పెళ్ళి చేసుకోడన్న గ్యారంటీ లేదు. లేదూ అంటే కనీసం 'పుంచుకోవడ'మనేదయినా ఎంతమందికి లేదు?! నా ఆలోచనల వల్ల నా చూపు మారిందేమో అమ్మ గ్రహించి 'ధనబాబూ ఇంటన్నావా?' అడిగింది. 'ఆ' అన్నాను.

'యారల్లపోరు అప్పజెళ్ళిల్ల మద్దిన ఏటుంటాదనీసి, ఆలిద్దరు కట్టుగ వుంటే బలంగుంటాదని ఆల అమ్మానాయిన సేసినారు' అమ్మ గుక్కతిప్పుకోవడానికి ఆగింది.

'ఇద్దరి పెళ్ళాలతో ఎంతమంది చక్కగా లేరు?' నాన్న అమ్మనే అడిగినా అమ్మవేపు చూడలేదు.

'నీకు నిలబడలేదు గాబట్టి నా ఒక్కర్తోని వుండి పోనావు గాని లేకపోతే నువ్వు నిలుపుకుందువు'. అని ఆగిన అమ్మ నాన్నకళ్ళలోకి తీక్షణంగా చూస్తూ'ఈ మనిషేటి తక్కువ తిన్నారేటి? నువ్వు కడుపులున్నప్పుడు అయిదే నెలో? ఆరో నెలో? ఆ టైంల ఇదేటీ తిరుగుళ్ళని అడిగినానని, కుర్చీతోటి దండిలెక్కొచ్చినట్టు బాదేనారా? ఆ ముష్టిలంజేటి సెప్పిందో అలాగ సేసినారు. బోల్డు రక్తంపోయింది. నువ్వు దక్కవనుకున్నాం' నా వేపు చూస్తూ ఆ రోజుల్ని గుర్తు చేసుకుంటోంది.

నాన్న ఇబ్బందిగా కదలడం గమనించకుండానే కనిపిస్తోంది. నా చూపు ఎందుకో దారి మళ్ళి మా ఆవిడ మీద పడింది. మా ఆవిడ నావేపే తీక్షణంగా చూస్తోంది. ఆ చూపు మా అమ్మ చూపులానేవుంది. నేను కూడా నాకు తెలియకుండానే అచ్చం మా నాన్నలాగే ఇబ్బందిగా కదిలాను. ఆలిని అమ్మలా చూసుకుంటానని ప్రతిజ్ఞ చేసి పెళ్ళి చేసుకున్న నేనూ... తను తిట్టిందని నే ఒకటి కొడితే తానొకటి కొట్టడం... నేనెన్నో కొట్టడం గుర్తుకువచ్చి సిగ్గుతో తలదించుకున్నాను.

నన్నూ నా ఇబ్బందినీ చూసే అందో, చూడకుండానే అందోగాని 'నల్లమ్మ కాసిన నలుగురికీ తోపమీదే మనసనీ, ఈ మొగవాళ్ళందరూ అంతే' అమ్మ శాస్త్రం పాడిచింది. నన్ను పాడిచినట్టూ అయింది.

కొద్దిసేపు మాటలాగిపోయాయి, కథ మరో వైపుకు తిరిగిపోకుండా మళ్ళీ నేనే గొంతు పెగుల్చుకొని అమ్మనడిగాను.

'ఇంతకీ ఇప్పుడేమయ్యింది?'

'ఇంటింటికీ వుంది మంటి పొయ్యని, కొందరు అలుక్కుంటారు, మరికొందరు అలుక్కోరు... ఆ యింటి పొయ్యి పొక్కల్లిరిగి పోవడమే కాదు, ఆ యింట్లో రెండు పొయ్యిలు పుట్నాయి.

సిన్నదాన్దీ దాని పిల్లలదీ ఒక వంట, పెద్దదాని పిల్లలదీ ఒక వంట. అదిగలాగ మొదలైంది' అన్నది అమ్మ.

'మరి ఆతగాడెక్కడ తింటున్నాడమ్మా' అడిగాన్నేను.

'మగోలు ఎక్కడైనా తింటారు, ఎక్కడైనా తాగుతారు. తందనాలాడుతారు. ఆలకేటీ? అతగాడు సిన్నదాని దగ్గర తింటాడు' అమ్మ చెపుతూనే వుంది.

నాన్న అందుకొని 'పెద్దదాని వంట బాగోదటలే' నవ్వకుండా కఠోర నిజమయినట్లు చెప్పేరు.

అమ్మకి ఆ మాటకి చాలా కోపం వచ్చినట్టుగా వుంది. 'నా నోరు తిన్నగరాదు గానీ, ఎనకటికిలాగేనట. రోకున్న కోడలు రోటిలేరిగితే ఇగురు కూరని ఇంటందరు పంచుకోగా నా కొకరవ్వ సాల్లేదని ఆడపడుసు ఆరు మాసాలలిగిందట అలాగుంది' అంది అమ్మ.

విని, విన్నాక చెవులు మూసుకొని 'ఛీ ఛీ' అన్నారు నాన్న బూతులు విన్నట్టు. వినలేనట్టున్నూ.

అమ్మ అందుకు కూడా మరో సామెత పాడిచే దేమో కాని మా ఆవిడ అనుమానపు ప్రశ్న 'ఇంతకీ అతను ఎవరి దగ్గరుంటున్నాడు?' అని.

'పిచ్చిదాన, ఇంతా విని రాముడికి సీతేటవుద్ది అని అడుగుతావేమే. సిన్నదాని ఇంట్లో తిండీ గిండీ అన్నీ. అన్నట్టుగ సెప్పినానా లేదో ఆ ఒక్కింట్లోనే రెండు పోర్షన్లు' అమ్మ చెప్పింది.

'ఇంతకీ ఇన్నాళ్ళూ లేంది ఇప్పుడు గొడవెందుకొచ్చింది?' ఆత్రుతతో అడిగాను.

'అద్గదీ అసలు ప్రశ్న ఆలస్యంగానైనా అడిగావు' నాన్న ఆనందంతో మెచ్చుకోలుగా చూసారు.

'ఏడేళ్ళో... పదేళ్ళో... ఎన్నాళ్లో సరిగ్గా మనకు తెలీదుగానీ కొన్నాళ్ళు పెద్దదాయి ఇక్కడ్నుంచి ఆల వూరిలోనున్న తోటా దొడ్డీ సూడ్డానికెళ్ళి అక్కడే వుండి పోయింది. ఎవసాయం సూసుకొని ఆయమ్మ అక్కడే వుండీది. ఎప్పుడో అదవా ఏదో పనిమీదొచ్చినా రొన్నాళ్ళకి తిరిగెలిపోయేది. పిల్లలు... దాని పిల్లలు దీని పిల్లలు అందరు సిన్నదాని దగ్గిరే వుండేవోరు. ఏటయ్యిందీ తిండి దగ్గిర ఒలపచ్చిక మొచ్చీసి 'పిన్ని ఆల పిల్లల్ని సూసినట్టుగా మమ్ముల్ని సూడ్డంలేదనీసి' ఈ పిల్లలు తల్లికి సెప్పినారు. తోటాదొడ్డీ తప్పితే పిల్లా జెల్లా అక్కర్లేదా? అని తల్లితోటి దెబ్బలాడినారు. ఏటి సెప్పినారో ఒక దగ్గిరుంటే కుండకి కుండే రాపిడి. ఒరిపిడి. అలాటిది మనిషి? ఏటి సెప్పేది? ఇదంతా తెలిసి ఆ పెద్దదాయి ఇంటికి ఇక్కడకొచ్చీసి కుండపట్టింది... 'నువ్వొదులంటే నువ్వొదులు' అనీసి ఇద్దరూ కుండలొదిలేసి జుత్తులు పట్టుకున్నారు.'

అమ్మ ఆగలేదు, నాన్న ఆపేసారు. 'మధ్యలో అతగాడేం చేస్తాడు? అంటూ.

'కట్టుకున్నోడు ఒకే యింట్ల ఇద్దర్ని పెట్టి కయ్యం పెట్టివోడు, కయ్యిం తీర్సడా?' అడిగింది అమ్మ.

'అన్నం కూడా తినిపిస్తాడు గోరుముద్దలు చేసి' అని కసురుకున్నట్టుగా అని 'బయటుద్యోగమే చేస్తాడా? ఇంట్లో ఈలితోనే పడతాడా?' విచారించారు కూడా నాన్న.

'అగు... అగు... అడపావోలి కోడలు పెనకన అగ్గెట్టేసి అత్తా నాబళ్ళు వడికె' అన్నాదట. నీలాటిదాయి, అతన్లాటి దాయి. ఇన్నాళూ లేంది ఇప్పుడే పొరపొచ్చం ఎందుకొచ్చింది? పెద్దదాయి పాలమొటలీసీ పుట్టాదిలీసి రాబట్టి ఇన్నాళూ అక్కడుండి సదువులకీ సోకులకీ కర్సులకీ డబ్బులు పంపేట. అటిప్పుడు ఆగిపోవడం వూపిరాగిపోయి ఎకూపిరి తగులుకున్నట్టుంది అతగాడికి' అమ్మ గొంతు రెచ్చిపోయింది.

'నువ్వు నోర్మూయ్యి. ఒకళ్ని అనడానికి ఆడడానికి మనమెవలం? కింద భూమాతుంది. పైన ఆకాశముంది, ఆపైన దేవతలున్నారు' నాన్న కుర్చీలోంచి కోపంగా అరుస్తూ లేచిపోయారు.

అమ్మ నాన్నల వాదులాటని శంకిస్తూ వున్న చిన్న తమ్ముడు బెరుకు కళ్ళతో 'వాళ్ళెవరి గురించో మనమెందుకు కొట్లాడుకోవడం?' అన్నాడు బుద్ధిగా కూర్చుంటూ కూర్చున్న మటమైనా కదపకుండానే.

మా ఆవిడ కూడా ఎక్కడ గొడవ పెరిగిపోతుందోనన్నట్టు నన్నిక మాట్లాడవద్దన్నట్టు కళ్ళు కదిపి తల అడ్డంగా ఊపింది.

'మాటొచ్చింది కాబట్టి ఇలక్కిలగ అని అనుకున్నాం, ఆడుకున్నాం. అతగాడి మీద మీ నాయన ఈగోలనివ్వరు. ఈగోలితే మీ నాన్న మీద దుడ్డోలిపోతాది' అమ్మ ఏమీ తగ్గలేదు.

'ఆవిడ్నంటే నీకే పుట్టుకొస్తాది. అలాటాడోలందర్నీ ఎనకేసుకొస్తావు' నాన్న ఇంకా మాట్లాడే వారే కానీ అమ్మ అవకాశమివ్వలేదు.

'అవున్రా. ఎవర్తి ఇంటికి ముందొచ్చిందిరా, పెద్దదాన్నొదిలీసి సిన్నదానితో టింగురంగడిలా గడుపుతాడు. ఎంత నెలనెలా జీతాలొచ్చిపడిపోతే మాత్రం? ఏరుపాట్లు తోటి వున్నప్పుడు నెలకో రెణ్నెల్లకో పడేసిన వేయి పన్నెండొందల్తోటి దాని పిల్లల్తోటి అదేటి బతుకుతాది? అదీ ఇష్టమయితే తీసుకో కష్టమయితే మానీమంటాడట'' అమ్మ నాకు వివరిస్తూ వుంది.

రైల్వే ఇల్లూ కరెంటూ వాటరు బిల్లు జీతంలోనే కట్టయిపోతుంది, ఇంక కట్టక్కర్లేదు' నాన్న మధ్యలో అన్నా ఆ మాట అమ్మని ఆటంకపర్చలేదు.

'అయితే అందుకేనిగావాల ఈలున్న గదికి కరంటు కనచ్చను తీసేసినారు. సిన్నదానికి గేసు పొయ్యి. పెద్దదానికి కిరసనూని స్టవ్వు! అమ్మ చెప్పుకుపోతుంటే నాన్న అన్నారు- 'ఆ తోటల్లంటా దొడ్లలంటా ఇన్నాళూ పడుండేది. అప్పుడే గేస్టవ్వుల మీద తిన్నాదో? ఇప్పుడు తిన్లేక పోతుంది. కోవిటోడ్ని సూసి నక్క సొంటిగొమ్ము అడిగిందాట. అలా గుంది. అయినా ఈ అందగత్తికి అపరంజి బొమ్మకి కిరసనూని వంటపడదు' ఆ మాట అంటున్నప్పుడు నాన్నలో నేను అతగాన్ని చూసాను.

'తోటపని, దొడ్డిపనీ' సేసి కంపయిపోయింది. ఎవసాయం సేసిన్దాయి ఎలాగుంతాది? నీడపట్టునుంతే ఎండిన నిట్రాట గూడా పచ్చని సెట్టులాగుంతాది. అయినా ఎవలకోసం ఎండనక వాననక మగపనీ ఆడపనీ సేసి పిల్లల్నొదిలీసి కడాక ముల్లు కంపయిపోయింది?! దానికితోడు అతగాడు సేసిందానికి మరింత ఎండిపోతంది. పెద్దదాని పెద్దకూతురుండగా సిన్నదాని సిన్నకూతురికి పెళ్ళి సేసినాడు. ఈ జల్మకాపోతే మరకజల్మకి అనుభవమైపోదా? పెద్దదాయి రక్తానికి రక్తం ఏడస్తంది' అమ్మ కంఠంలో గుండె భారమవ్వడం కనిపించింది.

'ఎందుకు వగలమారి ఏడుపులు? కట్టుకున్న మొగుడని చూడకుండా పోలీసు కంప్లైంటు ఇచ్చింది. తన్నించింది. పాపం అతగాడు నిన్న మా ఆఫీసు అరుగుమీద కూచోని ఎంత చెప్పుకొని ఏడ్చాడో! నాన్న గొంతులో విచార, విషాద ఛాయలు.

'అవును మరి మీకు ఆఫీసులుంతాయి సెప్పుకుంతారు' అమ్మ గొంతులో వెటకారం.

'మరి మీ ఆడోళ్లకి మహిళా మండళ్లు లేవా?' నాన్న గొంతులో సెటకారం.

ఈ గొడవ తెగదూ ముడిపడదనీసుకొని మా ఆవిడ అందరికీ ఒకేసారి భోజనాలు పెట్టేసింది.

'తింటే బలమొస్తాది' మా ఆవిడ ఇకటం ఆ సమయాన పండలేదు. కంచాల దగ్గర కూర్చున్నా కథ ఆగలేదు.

'బంగారం కన్నంలో చెయ్యి పెట్టిన ఇంత కాలానికి ఇతగానికి నొప్పెందుకు పెట్టింది?'

అదే విషయాన్ని అడిగాన్నేను.

'అతగాని బాధలు నీకూ నాకూ మీయమ్మకేటి తెలుసునురా. పగవాడికి కూడా రాకూడదు. పెద్దదాని కొడుకు అనారోగ్యం మందులూ మాకులు... మరో పక్క ఆడి ఉద్యోగం కోసం ఎంత డబ్బు ఖర్చు పెట్టాడనుకున్నావ్!' నాన్న నన్ను అడుగుతూవుంటే అమ్మ అందుకుంది.

'ఎందుకురా అనారోగ్గిం? కడుపులో వుండగ, అతగాడొద్దు అప్పుడే పిల్లలొద్దు అంటే పోవడానికి మందులు తిన్నాది. అది ఇలాగ సూపించింది. ఆ గుంటడు తేరుకున్నాడు గాని ఆడికి ఉజ్జోగం సూద్దమంటే ఆడికుజ్జోగమొస్తే కొడుకుతోటి పెద్దదాన్ని ఊర్నుంచి పంపించీ వచ్చిన కర్సుసేసినాడు. ఉజ్జోగమూ వచ్చింది. ఆడికీ తల్లిమాట కేర్‌లేదు. తండ్రి మాట కేర్‌లేదు. ఆడెప్పుడెక్కడో వొడ్డిదేశానున్నాడు. రేపు పెళ్ళయిపోయి ఆడిపెళ్ళాం పిల్లల్తోటి ఆడుపోతాడు. కట్టుకున్నోడికి లేదు, కడుపున కాసినోలకేటుంటాది?' అమ్మ నన్నడుగుతోంది.

నేను అన్నం కలిపిందే కలుపుతున్నాను.

'మామయ్యా... అత్తమ్మా తినండి అన్నం గాలి బారిపోతోంది' అన్నది మా ఆవిడ.

'నిజమే, గాలి బారిన కూడు పిగసగట్టదు, పెద్దాని బతుకు గాలిబారిపోయింది' అమ్మ అంటూ అనాసక్తంగా అన్నం తింటోంది.

నాన్న అన్నం తింటూ తింటూ ఆగి ఏదో గుర్తుకొచ్చిన వాడిలా 'అవిడకు కొడుకేల? మొగుడేల? లక్షలు మూటగట్టున్నాది... ఎపుడి లచ్చిమూలేదు. దానిపేరున వుందనీసి తోటా దొడ్డి అమ్మేస్తాదా పోసి అమ్మేసింది సరే. లక్షన్నర దాకా వచ్చింది. ఆ వచ్చిన దాంట్లో నయాపైసైనా తెచ్చి అది అంతగాడికప్పలే?! బేంకులో వేసుకుంది' ఆ విషయాలు చెపుతున్నప్పుడు నాన్న ముఖం కందగడ్డలా తయారయింది.

'ముసిలికాలాన మరొక మొగుడికెలిపోదామని మూటగట్టేసుకుంది' అమ్మ అనడమే కాదు, తట్టుకోలేనట్టు చేతులు తిప్పింది.

'డబ్బుంటే చాలు... ముసిలి కాలాన మొగుడెందుకు?!' నాన్న కూడా తినడం ఆపి మరీ అన్నారు.

'అవును మరి నీను కూడా ముసిలయిపోన్ను కదా, మీ నాన్న నన్నొదిలేస్తారు' అమ్మ తిక్కగా అంది.

నాకు తెలియకుండా నా చేతులు నిలిచిపోయాయి. ఆలోచనలు ఎక్కడెక్కడికో పోతున్నాయి. నేనూ నా లిటరేచరూ పాత్రలూ ప్రశ్నలూ జవాబులూ సందిగ్ధాలూ సమస్యలూ ఒరుసుకుంటూ పోతున్నాయి. ఎవరి ఒడ్డున వాళ్ళు ఎవరి వర్గం పక్షాన వాళ్లు.

ఆడా మగా రెండు వర్గాల్లాగ...

అమ్మా నాన్న రెండు వర్గాల్లాగ...

వర్గపోరాటం?

'ఆ ఆస్థి అంతా ఆవిడ పసుపు కుంకాల పేర ఇచ్చింది, ఆవిడ పేర్న రాసింది. ఆవిడే అక్కుదారి. దానికదే బతుకుదారి' అమ్మ అరచినట్లుగా చెపుతోంది.

'ఆస్తయినా పాస్తయినా మగోడి(దే) నువ్వు అంపోలోల అమ్మివా? బమ్మిడోల కోడలివా? నీ యింటి పేరేటి? అన్ని నావే... ఆస్తయినా పాస్తయినా' నాన్న అంతకంటే గట్టిగా అరిచి తెగేసి చెప్పారు.

జడ్జిగా వున్న నేను 'ఆర్డర్ ఆర్డర్' అరవకుండా అక్కడ లేకుండా వున్నాను. 'బాబూ మీ యిద్దరి పేర్న ఆస్తి కలిపి రాస్తాను' అని మా ఆవిడ తండ్రి అన్నప్పుడు 'అందువల్ల కలిసుంటామనా?' నేనడిగిన ప్రశ్నే నాకు పదే పదే గుర్తుకువస్తోంది.

'పట్టించుకోడుగదా ఆవిడ కూతురికి పెళ్ళిసెయ్యొద్దా? రేపు బతుకు పొద్దు పోవద్దా? దానితోటా దొడ్డి డబ్బు అదెందుకిస్తాది?' అమ్మ అడగడం చూస్తే ఆవిడ ఇచ్చినా తను ఇవ్వనిచ్చేటట్టు లేదు. నాన్న అదే మాటన్నారు. అని-'చస్తే అతగాడు రిటైర్‌మెంటు సొమ్ము సగం పట్టుకెళిపోతాదేమోగాని బతికుంటే ఒక్కపైసా ఇవ్వడు' అని కూడా నాన్న అన్నారు.

'మరి నువ్వు నీ పేర్న వున్నది అమ్మితే నాకు ఇవ్వవా? నాన్న అడిగేరు.

ఇల్లంతా నిశ్శబ్దం.

అందరూ అన్నం నమలడం మర్చిపోయారు.

'నువ్వేటి నీనేటి? కంఠం ముడి తెగిపోతుంతే ముడి ముక్కమాట ఒకటే మాట. నేనయినా అలాటప్పుడు ఇవ్వను. ఇవ్వనుగాక ఇవ్వను' అమ్మ గట్టిగానూ ఇంకా ప్రశాంతంగానూ చెప్పింది.

'లం... లేక ఇన్నాలూ నా దగ్గర నాకాల దగ్గిర లేక పడున్నావు గాని లేపోతే వుంటే, ఆ లం... లాగ నువ్వు బేంకులేసేసి నీలుగుదువు' అరుస్తూ నాన్న తింటున్న కంచాన్ని అమ్మ ముఖంమీదికి విసిరారు. క్షణాల్లో నాన్న ఎంగిలి చెయ్యి అమ్మ వీపుని తుడుచుకుంది. నేను తేరుకొని ఆపేసరికి జరక్కూడనిది జరిగిపోయింది.

నాన్న కొట్టింది అమ్మనయినా, తిట్లన్నీ 'పెద్దావిడికే' తిడుతున్నారు. అయినాక అలసి ఆగిపోయారు.

మా ఆవిడ ఎంగుల్లన్నీ తీసేసి వాతావరణాన్ని సర్దేస్తోంది.

అప్పుడు కళ్ళు తుడుచుకొని మా అమ్మ ఒక మాట అన్నది.

'నాయినా! ఈ అడ్డని మీ నాయినడ్డని ముప్పై ఏళ్ళుగ కొలుస్తన్నాను. ఇవేళ కొత్తగ కొలిసిందేటి లేదుగాని, ఇన్నాళూ ఆస్తిపాస్తులకి అన్నదమ్ముల తన్నుకుండీవోరు, ఇప్పుడు ఆలుమగలకయినా అది తప్పినట్టుగ లేదు.......

★ ★ ★

*ప్రచురణ : ఆదివారం ఆంధ్రజ్యోతి, 28 మార్చి, 1999*

*రచనా కాలం : 13, 14 మార్చి '99*